1921


# ధర్మసాధని

[బ్రహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.] 1921

ధర్మం చర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮. సంచిక ౧.

1 1921

కాకినాడ.—శనివారము, ౧, జనవరి, ౧౯౨౧.

చందా సం॥ రు ౩. విడిసంచిక అ ౧.


## ఓమ్.

ప్రభూ! ఒక్క గృహమును నిర్మించుటకే నీవు నీ సేవకుల నియోగించితివి. అనేక గృహములు గాదు. కాని కలిసియుండలేని వారు ప్రత్యేకముగా ఒక్కొక్క గృహమును నిర్మించుకొనుచున్నారు. ఒండొరుల గృహముల నధిక్షేపించుకొనుచున్నారు. అంతి, కలుపుగోలుతనము లేకపోవుటలోనే దురగర్వము, మతస్వార్థపరత్వము, మూఢవిశ్వాసము కనుపించుచున్నవి. మేమందరము ఒక్క భవనములోని భాగములము, ఒక్క దేహములోని అంతర్భాగములము. తండ్రి నీవు ఒక్క గృహములో వసించుటకే మమ్ము అహ్వానము చేసితివి. అట్టి విశ్వాసమును అట్టి ఐకమత్యమును మాకు కలుగు

(కేశవచంద్రసేన)

---

ఉద్యానవన పదార్థమును చూడగానే నోరు ఊరుచున్నది. సుందరమైన వస్తువును గాంచగనే మోహము పుట్టును. శ్రావ్యమైన స్వరము వినగనే చెవులు నిక్క పొడుచుకొనును, సువాసన సోకగనే ముక్కుపుటములు పులకించి జెందును. ఈ జ్ఞానేంద్రియములవలన గల్గు సౌఖ్యాతిశయము ఈశ్వర భజనవలన నీకు గలుగుచున్నదా? భగవన్నామమును వినగనే నీ దేహము ఉప్పొంగుచున్నదా? ఈశ్వర దర్శనముకొరకు నీ హృదయము తహతహపడుచున్నదా? ఇంద్రియ భోగములకై నీమనస్సులో గల్గు ఆ తృష్ణ, ఆ వేదన, తత్తరపాటు, తన్మయత్వము నీకు ఈశ్వర సంయోగమునకు కలుగుచున్నదా? కలుగనిచో భగవంతునియందు నీవు చాలదూరమున నున్నావని స్పష్టముగా తెలిసికొనుము. ఇంద్రియ సుఖలాలసత్వము ఎంత తగ్గిన అమృతానంద మంత అధికమగును.

---

ప్రపంచములో ప్రపంచపు తీరున నుండుట సులభము. ఒంటిగ నున్నపుడు తపస్విరూప నొందుట సులభము. కాని జనసమూహమునందుండియు ఏకాంత వాసమునందలి సంపూర్ణ స్వేచ్ఛామాధుర్యమును అనుభవించువాడె మహాపురుషుడు. (యమర్సన్)

---

వృక్షము కాలుచున్నప్పుడు పక్షులు దానిపై నుండజాలవు. అదేవిధమున కామక్రోధాదులనెడి అగ్ని జ్వాలచే దహింపబడు మానవశరీరమందు, సత్యము నిలువజాలదు.

బుద్ధుడు.

---

## సత్సంగము.

—:o:—

యవనహరిదాసు వంగదేశములోని "బెనాపోలెక" వనమందు భక్తిసాధనను జేయుచుండెను. అప్పుడొకయన వైరాగ్యమును నాశనము చేయుటకుగాను, రామచంద్రఖానుడను సుందరమైన వేశ్య నొకదానిని బంపెను. వేశ్య యౌవనము రూపలావణ్యము చెడగొట్టుటకుగాను, సమయము వేచి, యింటిలో కూర్చుండియుండెను. యవనహరిదాసు తనకుటీరమునందు కూర్చుండి హరినామస్మరణ జేయుచుండెను. ఈయన నామసంకీర్తన పూర్తియగునప్పటికి సూర్యోదయమయ్యెను. అంతవరకు ఆ స్థలమందు వేశ్య వచ్చి సమయమునకు వేచియుండెను. కాని ఆయన నామజపము పూర్తియగునప్పటికి తెల్లవారుచుండును. మూడవ దినము తెల్లవారుచుండగా, హరినామ శ్రవణమువలన వేశ్యహృదయము కరిగి హరిదాసుని పాదములపైబడి కన్నీరు వరదవలె పారుచుండ "భక్తవరా! నేను మహాపాపిని. నేచేసిన పాపములు అనంతములు. కావున నీ పాపినియందు దయగ్రహించి కడతేర్చుము." అని ప్రార్థింప దొడగెను. సత్సంగమువలన గదా వేశ్య మహాభక్తురాలాయెను. తరువాత గొప్పగొప్ప సాధువులు ఆమెను సందర్శించి ధన్యులైతిమని తలంచుచుండిరి.

భక్తియోగము.